**'చేస్తే పోలీసు యస్. ఐ. ఉద్యోగమే చేయాలి' అనుకున్నాడు చందు.**
**పదో తరగతి చదివేప్పటి నుంచి అలాగే అనుకుంటుండేవాడు.**

ఆ ద్రస్సూ, అధికారం హోదా ఇవన్నీ చేతిలో ఉంటేనే మనిషి అనే భావన మొదటి నుంచీ చందులో పాతుకొనిపోయింది.

బి.ఏ. పూర్తయింది.

రెండవ తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు కూడా.

ఇక అప్పటి నుంచి యస్.ఐ. ఉద్యోగానికి ప్రయత్నాలు ప్రారంభమైనవి.

చందూ నాన్నగారు జాతీయ కాంగ్రెస్ ఉద్యమంలో బాగా పనిచేసిన వాడు.

ఇప్పుడు లేడు. కాలం చేసి నాల్గయిదేళ్ళు అయింది.

ఆయనకో మిత్రుడుండేవాడు. పేరు శివయ్య.

ఈయనగారు ఉండేది రాజధానిలో.

మాంచి పైరవీకారుగా పేరు వినిపిస్తూ వుంటుంది. ఈ వృత్తిలోనే బాగా గడించాడు కూడా. ఆయనకు అయిదుగురు సంతానం. నలుగురు మగవాళ్ళూ, ఆడపిల్లానూ. ఆడపిల్లే చిన్నదయినా, ఆమె బి.ఏ. దాకా వచ్చింది. నలుగురు కొడుకులూ ఉద్యోగాలలోనే ఉన్నారు. ఎవరి సంసారాలు వారివి. ఎవరి పని వారిది.

శివయ్యా, ఆయన భార్య అనంతలక్ష్మి కూతురు సరస్వతీ మాత్రమే లంకంత ఇంట్లో ఉంటున్నారు.

యస్ ఐ. సెలక్షనుకోసం అప్లికేషన్లు పెట్టుకోమని పేపరులో పడింది.

అప్లయిచేసి- జిల్లాలో సెలక్టయి- పైరవీకి హైద్రాబాదు- శివయ్యగార్ని కలుద్దామని బయలుదేరాడు చందూ.

చేరాడు.

శివయ్యగారింటి అడ్రసు పట్టుకొని ఆ యింట్లోనే ప్రవేశించాడు.

చందూ తండ్రితో ఉన్న పరిచయాన్ని పురస్కరించుకొని అక్కడే ఉండమన్నాడు శివయ్య.

విషయం తెలుసుకుని- విచారించి వస్తానని చెప్పి- బయట పడ్డాడు. ఆ పడటం తెల్లారి సాయంత్రానికి గని ఇంటికి చేరలేకపోయాడు శివయ్య.

చందూని చూసి "బయటకి వెళ్దాం తయారవు" అని చెప్పి స్నానపానాదికాలు పూర్తి చేసుకొని బయటకొచ్చారు.

"అజంతా హోటలుకు పోనీయ్" అన్నాడు శివయ్య ఆటోను ఆపి.

ఇద్దరూ దాన్లో ఎక్కి కూర్చున్నారు.

'ఎందుకు?' అని అడగలేకపోయాడు చందు.

హోటలు దగ్గర దిగగానే ఆటోకు కిరాయి ఇచ్చి 'రా' అని మెట్లెక్కి రూం నెంబరు 113 దగ్గర ఆగాడు. గది తాళం తీసి లైటేసి, ఫ్యానేసి కుర్చీపై ఆరామ్‌గా కూర్చుని- కూర్చోమని మరొక కుర్చీ చూపించాడు.

గదిని పరిశీలనగా చూసాడు చందు.

ఖరీదైనదిగా కనిపించింది.

నేలపైన ఎర్రటి కార్పెట్ ఉంది. నాల్గుకుర్చీలూ- టేబులుంది. ఒక డబుల్ కాట్ ఉంది. దానిపై అందమైన శద్దరూ రగ్గూ- స్పాంజిదిళ్ళు ఉన్నాయి. చల్లని నీళ్ళకోసం ఫ్రిజ్ ఉంది. గోడలకు మాంచి ఖరీదైన పెయింట్లున్నాయి. నిలువుటద్దం ఉంది. టేపు రికార్డరుంది. ఒకటేమిటి! 'అసలు లేనిదేమిటి?' అనే ఆలోచనలో పడిపోయాడు.

అరగంటసేపు మౌనంగా గడిపి ఆగలేక 'సన్నేంచేసారు?' అనడిగాడు చందూ.

"చెప్తాను" అన్నట్టు సైగ చేసాడు శివయ్య.

గంట గడిచింది.

"రాంబాయిగారు వచ్చారు" అన్నాడు సప్లయరు వచ్చి

"రమ్మను" అన్నాడు శివయ్య.

ఆ మాట వినగానే- మొఖం విప్పారింది.

ఆలోచన ఆగిపోయింది.


విలాసంగా సిగరెట్టు అంటించి చందూ వైపు చూసాడు.

అర్థంగాక, శివయ్య చూపును తట్టుకోలేక, తలదించుకున్నాడు చందూ.

"బాయిల్డ్‌రైస్‌మిల్లుకు పర్మిషనిప్పించా నివ్వాళ" అన్నాడు శివయ్య ఉత్సాహంగా.

"ఎవరికి?" అన్నాడు చందూ అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తూ.

"విశాఖపట్నంవాళ్ళకు. మంచిపార్టీ- ఈ అరేంజిమెంటులంతా చేసిపోయారు. బాగా



ఫోటో: శ్రీనగేష్

# రేటు

## చావా శివకోటి




పే చేశారు" అన్నాడు.

స్కాచ్ విస్కీ బాటిల్ వోపెన్ చేసి-గ్లాసులో పోసి షోడాకలిపి— జీడిపప్పు పొట్లం విప్పి ప్లేటులో వేసి వెళ్ళి పోయాడు బేరరు.

తలుపు మూసుకుంటుండగా "మే ఐ కమిన్? అని ఒక తీయటి గొంతు వినిపించింది.

"ఎస్" అన్నాడు శివయ్య.

పాతిక సంవత్సరాల వయసున్న ఒక సొగసుకత్తె లోనికి ప్రవేశించింది.

"బి సీటెడ్" అన్నాడు ఎదుటికుర్చీ చూపి.

కూర్చొని రెండోగ్లాసుకు మందు కలిపింది రాంబాయి.

"చీర్స్" చెప్పుకున్నారు,

కబుర్లలో పడ్డారు.

"నేను వెళ్తాను"అని లేచాడు చందూ.

"కూర్చో" అని- "ఇతను తెలియదు కదా! పరిచయం చేస్తాను. నా స్నేహితుని కొడుకు బి.ఎ. చదివాడు పోలీసు ఉద్యోగం కోసం వచ్చాడు. పేరు చంద్రం-అదే చందూ. సాయంత్రం ఆ విషయమే ఆలోచించాను. కావల్సిన ఒకర్ని కలిసాను. రేటు గిడితే ఫలితం ఉంటుంది. ఏమైనా

## హేమంత సుందరి

అరుణారుణకాంతి నీ సీమంతంలో కుంకుమ వర్ణమై
మేఘాల నీలిమ నీ నయన తారకలలో దోబూచుల నిలయమై
నీవు తుషార ధవళ వర్ణానురాగ ప్రఫుల్ల మందాకినివై
హేమంతంలో ఓ సీమంతినీ! నీవు వనసుందరివై
నా హృదయంలో మంద మారుతమై వీస్తున్నావు.

—మెతుకు మనోహర్ రెడ్డి

తగ్గుతుందేమో? మీ నాన్న సంపాదించి ఇచ్చి పోలేదు కదా! అని విచారించాను" అని రెండు గుక్కల్లో గ్లాసు ఖాళీ చేసి, నాల్గు జీడిపప్పు పలుకుల్ని నోట్లో వేసుకున్నాడు.

నమిలి మింగి రాంబాయి తిరిగి నింపుతున్న గ్లాసును చూస్తూ "నాల్గురకాల రేట్లు కనిపించినయి" అన్నాడు.

"చెప్పండి" అన్నాడు చందూ కుర్చీ నుంచి లేచి వినయంగా.

"అదే చెప్తాన- డి.ఐ.జి గారితో ఈ పని పూర్తవటం అయితే రేటు పాతిక వేలు. ఆఫీసు స్టాఫ్‌తో అవుతే పదిహేను వేలు. హోం మంత్రిగారితో అవుతే నలభయివేలు (ఈ పైకం పనికాక పోయినా వాపసు వచ్చే నమ్మకం లేదు.) ముఖ్యమంత్రి తోనే అవుతే ఏభై వేలు"

"ఉద్యోగం ఒక్కటేగదసార్! ఇన్ని రేట్లెందుకు?" అన్నాడు చందు అయోమయమైపోయి.

"ఇదిగో చందూ! నీకు కావల్సిన ఉద్యోగం యస్.ఐ., అయితే దీనికి ఇన్ని రకాల ద్వారాలున్నాయి ప్రవేశించటానికి. వీలూ అవకాశం పరిధీ- ఈ నాల్గు తోవలలో ఎటు? అన్నది నిర్ణయం చేస్తాయి. రాజకీయంగా బాగా బలిసినవాడు ఉన్నాడనుకో. మంత్రిగారు చెప్తారు. ఆయన ముచ్చట ఆయనకెళ్తుంది. ఆఫీస్ స్టాఫ్ ఉందనుకో. మనబోటివాళ్ళకు అందుబాటులో ఉంటుంది. ఇంకా పైవాళ్ళు షావుకార్లు ఉన్నారనుకో. ముఖ్యమంత్రి- అయితే ఈ నాలుగు మార్గాలలోనూ మనవాళ్ళున్నారు. నీ పరిధికి పదిహేను వేలు కావాలి. నేను అరేంజిమెంటు చేసి పెట్టగలను. ఖరీదైన కేసు ఏదైనా ఉంటే ప్రత్యేకంగా ఏభై తీసుకుని చేద్దాం. నీకు కొంత కన్సెషన్ దొరుకుతుంది." అన్నాడు గ్లాసు తిరిగి చేతిలోకి తీసుకొని.

"పదిహేనువేలు కావాలి" అన్న ఒక్క మాట మినహా ఏమీ అర్థం కాలేదు చందూకు.

ఉన్నఇల్లు తాకట్టు పెడితే ఆ పైకం వస్తుందనే నమ్మకం మాత్రం అతనికి కలిగింది.

"మంచిది" అని లేవబోయాడు.

"ఇదిగో శివుడూ! నువ్వు చెప్పిన రేట్లు చూస్తే నవ్వొస్తోంది" అని పకపక నవ్విందద రాబాయి.

మత్తుగా ఆ నవ్వుని చూసి "ఈడ కూర్చో" అని తొడ చూపించాడు శివుడు. సుయోధన సార్వభౌముడు ద్రౌపదికి నిండు పేరోలగంలో చూపినట్టు.

ద్రౌపదిలా అగ్గయిపోయి ప్రతిజ్ఞలు చేయలేదు రాంబాయి.

జారిపోయిన పైటను అలాగే వదిలేసి ఓ గుక్కెడు ద్రవాన్ని గొంతులో పోసుకుని శివుడు తొడపై నాజూకు శరీరాన్ని సుతారంగా ఆనించింది. భుజంపై చేయ్యేసి ముద్దు పెట్టుకోబోయాడు.

సెన్సారు వాళ్ళలాగా ఫిల్మ కట్ చేయలేక- ఈవైపు మళ్ళాడు చందూ.

"ఎందుకు నవ్వావోయ్" అన్నాడు రాంబాయి నడుంపై చేయ్యేసి గోముగా చూస్తూ.

"వస్తువు ఒకటే కదా! యస్. ఐ. పోస్టు. దానికున్న రేట్లు నువ్వేగా చెప్పావు? నేను ఒక్కరికే- కొనుగోలుశక్తి ఉన్నవాణ్ని పట్టి రేటు ఉంటుందనుకున్నాను" అని మళ్ళీ పగలబడి నవ్వింది.

'అబ్బ! ఎంత అందంగా నవ్వింది' అనుకున్నాడు చందూ.

"విషయం చెప్పు! నవ్వమాకు" అన్నాడు ముద్దుగా ఆమె శరీర భాగాల్ని తడుముతూ. చక్కిలిగిలి అయి తొడపై నుంచి లేచి కుర్చీవైపు కదుగేసింది రాంబాయి.

పట్టుకోబోయాడు శివయ్య.

తప్పించుకుని- దూరంగా- కూర్చుంటూ గ్లాసందుకుంది రాంబాయి.

"సరే చెప్పు?" అన్నాడు మందు కలుపుతూ శివుడు

"రేటా? చెప్తాను. మీ బాయిల్డు రైసు మిల్లోళ్ళు నీతో ఈ రాత్రికి నేను ఉండటానికి- వెయ్యి ఇచ్చారు. అదే మొన్న ఒక సినిమా ప్రొడ్యూసరు ఎ.సి రూంలో ఉంచుకుని పదిహేను వందలిచ్చి సీమసరుకూ- చికెనూ పెట్టాడు. చూసి ఆనందించడం తప్ప పని లేదు. అదే గిరాకీ లేని నాడు ఏభై రూపాయలకి కాలేజీ పోరగాళ్ళు తీసికెళ్ళి వళ్ళంతా హూనం చేసేసేరు. మన సుందర్‌లాల్ లేడూ- అదు అయిదొందలిచ్చి ఆరింటికే ఇంటికి తీసుకెళ్ళి మొత్తం విప్పించి తెల్లార్లూ చూస్తూ కూర్చుంటాడు. టైము- అందరికీ ఒక్కటే. మనిషినీ ఒక్కదాన్ని. కాని రేట్లు? నాలాగే అన్నింటికీ ఉన్నాయని తెల్సేసరికి నవ్వొచ్చింది. ఇన్నాళ్ళూ మా బతుక్కే ఇది అనుకునేదాన్ని. కాదు" అని ఆగింది. కళ్ళు కొంచెం చిట్లించి బాటిల్ వైపు చూసింది. గ్లాసు దింపి జీడిపప్పు సుతారంగా నోట్లో వేసుకుని మందు కలుపుకుని శివయ్య కేమైనా సాయపడా లేమోనని చూసింది.

"రేటు?" అని అతనిలో అతనే గొణుక్కుంటూ నవ్వుకుని కసిగా మిగిలిన ద్రవాన్ని గొంతులో పోసుకున్నాడు.